సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం । 12 । మార్చి । 2023



మళ్లీ ప్రాణం పోసేలా..
దేశవ్యాప్తంగా నడెన్ కార్డియాక్ అరెస్ట్ కేసులు ఇటీవల పెరిగాయి. అయితే హార్ట్ ఎటాక్ వచ్చిన వారికి వెంటనే సీపీఆర్ చేస్తే బతికే అవకాశాలు ఉన్నాయి. 8లో▸



'కల్చరల్ ఫెస్ట్'.. అభినందనీయం
కల్చరల్ ఫెస్ట్ నిర్వహణ అభినందనీయమని జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
35.0/19.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గనుంది. ఉక్కపోత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జీవనోపాధి పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ఎంఆర్ సునీత

ఆదిలాబాద్‌టౌన్: మహిళలు జీవనోపాధిని పెంపొందించుకోవాలని జిల్లా జడ్జి ఎంఆర్.సునీత అన్నారు. హెచ్ఐవీ బారిన పడిన ఐదుగురు మహిళలకు జిల్లా కోర్టులో శనివారం కుట్టు మిషన్లను అందజేశారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, వీ హెల్ప్ పూర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి మాదవీకృష్ణ, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

సర్పంచ్ మీనాక్షిని ఆదర్శంగా తీసుకోవాలి



సర్పంచ్ మీనాక్షిని సన్మానిస్తున్న ఈశ్వరీబాయి

ఇచ్చోడ: మహిళలు ముఖరా(కె) సర్పంచ్ గాడ్గే మీనాక్షిని ఆదర్శంగా తీసుకోవాలని తెలంగాణ మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి అన్నారు. శనివారం ఆమె ముఖరా(కె) పంచాయతీలో సర్పంచ్ గాడ్గే మీనాక్షిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా నడిపిస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మీనాక్షి అవార్డు అందుకోవడం మహిళా లోకానికే గర్వకారణమన్నారు. సంక్షేమ పథకాలను వందశాతం అమలు చేయడంలో రాష్ట్రంలోనే ముందు నిలిచారన్నారు. కార్యక్రమంలో ఇచ్చోడ మాజీ మార్కెట్ చైర్‌పర్సన్ శీల పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్‌లోకి కాంగ్రెస్ కౌన్సిలర్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని 14వ వార్డుకు చెందిన కాంగ్రెస్ కౌన్సిలర్ బడాల సుజాత నేడు భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) తీర్థం పుచ్చుకోనున్నారు. ఎమ్మెల్యే జోగు రామన్న సమక్షంలో పార్టీలో చేరనున్నారు. విషయాన్ని ఆమె 'సాక్షి'కి తెలిపారు. ఆమెతో పాటు కాలనీకి చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరనున్నారు. ఇటీవల ఓ కౌన్సిలర్ బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలోకి చేరిన విషయం తెలిసిందే. ఆ సంఖ్యను బీఆర్‌ఎస్ నాయకులు సరి చేస్తున్నట్లు తెలుస్తోంది.


కోర్టు ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ ప్రతినిధులు

ఆదిలాబాద్‌టౌన్: న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కరుణాకర్, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా సుకుమార్, అమృతవాణి ఎన్నికయ్యారు. అలాగే కోశాధికారిగా కృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా గంగుతాయి,సత్యనారాయణ,క్రీడల కార్యదర్శిగాదినేష్, మహిళా ప్రతినిధిగా ఉమావతి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఫ్యామిలీ కోర్టు ఏవో స్వరూప వ్యవహరించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

తపాలా బీమా కుటుంబాలకు ధీమా



మాట్లాడుతున్న సుజిత్ కుమార్

గుడిహత్నూర్:తపాలా బీమాతో కుటుంబాలకు ధీమా లభిస్తుందని పోస్టల్‌శాఖ నిర్మల్ సబ్ డివిజన్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సుజిత్‌కుమార్ అన్నారు. మండలంలోని తోషం బ్రాంచిని శనివారం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని పోస్టాఫీసులో బీపీఎంలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ ప్రాంత పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తుందన్నారు. వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో సబ్ పోస్ట్‌మాస్టర్ శేషారావ్, తదితరులున్నారు.

హస్తంలో సఖ్యతేది?



- 'భట్టి' యాత్ర ఖరారైనా డీసీసీకే స్పష్టత కరువు
- రూట్‌మ్యాప్ తయారీలోనూ కనిపించని సమన్వయం
- ఎవరు ఏ వర్గంలో ఉన్నారో తెలియని వైనం
- ఎమ్మెల్యే టికెట్లపై జెడ్పీటీసీల ఫోకస్
- కాంగ్రెస్‌లో అంతా అయోమయం

సాక్షి,ఆదిలాబాద్: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రను ఆదిలాబాద్ జిల్లా మీదుగా ప్రారంభిస్తున్నారు. దీనికి సంబంధించి శనివారం ఆయన హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ప్రెస్‌మీట్ ద్వారా వెల్లడించారు. ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు ఆ సమావేశంలో ఆయన వెంట ఉన్నారు. అయితే జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)కి ఇప్పటి వరకు యాత్రపై ఆయా నేతలు స్పష్టతనివ్వకపోవడం గమనార్హం. దీనికి సంబంధించి రూట్ మ్యాప్ తయారీలోనూ కనీసం సమాచారం కూడా అడగలేదని తెలుస్తోంది. ఇప్పటికైనా యాత్ర షెడ్యూల్ పంపిస్తారా.. లేదా.. అని డీసీసీ ఎదురుచూసే పరిస్థితి. దీన్నిబట్టే కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు తీవ్రత ఏవిధంగా ఉందో స్పష్టమవుతుంది.

ఉమ్మడి జిల్లాలో రేవంత్ యాత్ర లేనట్టే..

ఇదివరకు డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ ఉమ్మడి జిల్లా పరంగా మహేశ్వర్‌రెడ్డి వర్గంగా కొనసాగారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత ప్రేమ్‌సాగర్‌రావు వర్గంగా కొనసాగారు. ఇటీవల అధిష్టానం కొత్త కమిటీలు వేయగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఖానాపూర్ నియోజకవర్గానికి చెందిన వెడ్మ బొజ్జును నియమించారు. ఆయన రేవంత్‌రెడ్డి వర్గంగా ఉన్నారు. కాగా, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి వర్సెస్ సీనియర్ కాంగ్రెస్ నేతల వర్గపోరు కొనసాగుతున్న విషయం తెలిసిందే. గతంలో ఉమ్మడి జిల్లాలో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత వర్గపోరు ఉన్నప్పటికీ రాష్ట్ర స్థాయిలో ఈ ఇద్దరు ఒక్కటై మిగతా సీనియర్ నాయకులతో కలిసి రేవంత్‌రెడ్డిని వ్యతిరేక వర్గంగా కొనసాగుతున్నారు. ఇటీవల మహేశ్వర్‌రెడ్డి నిర్మల్ జిల్లాలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. తాజాగా ఆదిలాబాద్ జిల్లాలో భట్టి ద్వారా ఈ యాత్ర చేపడుతున్నారు. ఇక్కడి నుంచి మొదలై కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలోనూ సాగేలా ప్రణాళిక చేశారు. తద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రేవంత్ పాదయాత్రకు అవకాశం లేదనే ప్రచారం పార్టీ శ్రేణుల్లో జరుగుతుంది.

అంతా అయోమయం..

డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ ఇది వరకు మహేశ్వర్‌రెడ్డి వర్గంలో కొనసాగారు. ప్రస్తుతం ఆయనతో అతనికి సఖ్యత ఉందా.. లేదా.. తెలియట్లేదు. అలాగే పీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత ప్రేమ్‌సాగర్‌రావు వర్గంలో కొనసాగారు.. ఇప్పుడు ఆమె అదే కంటిన్యూ అవుతున్నారా.. లేని పక్షంలో పరిస్థితులు ఎలా ఉన్నా యనే దానిపై కార్యకర్తల్లో అయోమయం. దీనికి కారణం లేకపోలేదు. జిల్లాలో కాంగ్రెస్‌కు ముగ్గురు జెడ్పీటీసీలు ఉన్నారు. వారిలో ఒకరు ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీ టికెట్‌ను ఆశిస్తున్నారనే ప్రచారం జరుగుతుంది. సదరు జెడ్పీటీసీతో పార్టీకి చెందిన మరో జెడ్పీటీసీతో మంచి సఖ్యత ఉంది. ఆ జెడ్పీటీసీ ప్రేమ్ సాగర్‌రావు వర్గంగా కొనసాగుతుండడంతో ఇప్పుడు సుజాత వర్గంలో కొంత ఆందోళన కన్పిస్తున్నట్లు ప్రచారం సాగుతుంది. రిజర్వ్‌డ్ నియోజకవర్గం నుంచి మరో జెడ్పీటీసీ పార్టీ టికెట్‌ను ఆశిస్తున్నారు. తను మహేశ్వర్‌రెడ్డి వర్గంగా కొనసాగుతున్నారు. ఈ నియోజకవర్గంలో రేవంత్‌వర్గం నుంచి టీపీసీసీ కమిటీలో చోటు దక్కించుకున్న యువ నాయకుడు పోటీ పడుతున్నారు. దీంతో ప్రస్తుతం జిల్లాలో ఏ నాయకుడు ఎవరి వర్గం.. అనే తీవ్ర అయోమయం కొనసాగుతుంది.

భట్టి విక్రమార్క టూర్ ఇలా..

ఈ నెల 16 నుంచి జూన్ 15 వరకు 91 రోజుల పాటు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రను ఆదిలాబాద్ జిల్లా నుంచే ప్రారంభిస్తున్నారు. బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామం నుంచి ఆ రోజు సాయంత్రం 4 గంటలకు పాదయాత్ర ప్రారంభించనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ యాత్ర కొనసాగనుంది. అందులో మూడు ఎస్టీ నియోజకవర్గాలు, రెండు ఎస్సీ నియోజకవర్గాల మీదుగా సాగనుంది. బోథ్‌లో ప్రారంభమై ఖానాపూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూర్, మంచిర్యాల నియోజకవర్గాల్లో కొనసాగనుంది. ఉమ్మడి జిల్లాలో ఈ పాదయాత్రకు సంబంధించి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ప్రేమ్ సాగర్‌రావులు పర్యవేక్షణ చేస్తున్నారు. వారి కనుసన్నల్లోనే ఈ రూట్ మ్యాప్ తయారైనట్లు పార్టీలోచర్చించుకుంటున్నారు.

బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకే యాత్ర



మాట్లాడుతున్న సత్తు మల్లేశ్

ఇచ్చోడ: తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలకు ఒరిగిందేమి లేదని, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకే కాంగ్రెస్ పార్టీ హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహిస్తున్నదని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ సత్తు మల్లేశ్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో పార్టీ బోథ్ నియోజకవర్గ స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కేవలం టీఆర్‌ఎస్ నుంచి బీఆర్‌ఎస్‌గా రూపాంతరం చెంది నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకే కాంగ్రెస్ ఈ యాత్రకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రతీ కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ వెడ్మ బొజ్జు, ఏఐసీసీ నాయకుడు నరేశ్ జాదవ్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, ఇచ్చోడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిముద్‌ఖాన్, పార్టీ మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై.. 'ఎన్‌ఫోర్స్‌మెంట్'

- టీఎస్ బీపాస్‌లో ప్రత్యేక పోర్టల్
- ఇక ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల స్వీకరణ
- ఆర్అండ్‌బీ, పోలీస్, ఫైర్, రెవెన్యూశాఖలకు బాధ్యతలు
- త్వరలోనే అమలు



టీఎస్ బీపాస్ పోర్టల్

కైలాస్‌నగర్: మీ ఇంటి పక్కన అక్రమంగా ఇల్లు కడుతున్నారా... ప్రభుత్వ, చెరువు శిఖం భూములను ఆక్రమించారా.. రోడ్డు, మురుగు కాలువలను ఆక్రమించి వాటిపై నిర్మాణాలు చేపడుతున్నారా.. ఇలాంటి అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు ఇకపై కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. వాటిపై ఆన్‌లైన్‌లోనే ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకోసం ప్రభుత్వం టీఎస్ బీపాస్ పోర్టల్‌లోనే ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆప్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇది వరకు ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకునే అధికారం మున్సిపల్ అధికారులకే ఉండగా తాజాగా ఆర్అండ్‌బీ, పోలీస్, ఫైర్, రెవెన్యూ శాఖలకు సైతం భాగస్వామ్యం కల్పించారు. ప్రత్యేక పోర్టల్ అమలుపై ఇటీవల వరంగల్‌లో టౌన్ ప్లానింగ్ అధికారులకు శిక్షణ సైతం అందించారు. త్వరలోనే ఈ విధానం అమల్లోకి రానుండగా, ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచనున్నారు.

మూడు దశల్లో ఫిర్యాదుల పరిశీలన

అక్రమ నిర్మాణాలపై టీఎస్ బీపాస్ పోర్టల్‌లోకి వెళ్లి header. enforcement& grivance అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి. ఇందులో ఫిర్యాదుదారు పేరు, ఆక్రమణ జరిగిన ప్రాంతం, దాని ఆధారాలు తెలిపేవిధంగా ఫొటోలను జత చేయాలి. ఫిర్యాదుదారులు తమ ఈ మెయిల్ ఐడీ, ఫోన్‌నంబర్‌ను విధిగా అందులో నమోదు చేయాలి. ఈ ఫిర్యాదులు తొలుత ఎల్1 అధికారులైన ఆర్అండ్‌బీ, పోలీస్, రెవెన్యూ, ఫైర్‌శాఖల అధికారుల లాగిన్‌లోకి వెళ్తాయి. వాటిని సంబంధిత అధికారులు పరిశీలించి చర్యలు తీసుకునే అవసరముంటే మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎల్2 లాగిన్‌కు పంపిస్తారు. సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు వాటిని ఆయా శాఖల అధికారులతో కలిసి పరిశీలిస్తారు. చర్యలు తీసుకోవాలా.. అవసరం లేదా అనే వివరాలను ఎల్ 3 లాగిన్ ద్వారా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళుతారు. మూడు దశల్లో పరిశీలన అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు వాటిపై చర్యలు చేపడుతారు. అక్రమాలని తేలితే మాత్రం కూల్చివేస్తారు. ఆయా శాఖల సమష్టి భాగస్వామ్యం కల్పించడంతో అక్రమ నిర్మాణాలకు చెక్ పడే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

త్వరలో అందుబాటులోకి..

ప్రత్యేక పోర్టల్‌లో ఆన్‌లైన్ ఫిర్యాదుల స్వీకరణ, అమలుపై ఇటీవల వరంగల్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ శాఖ ద్వారా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు శిక్షణ ఇచ్చారు. విధి విధానాలు, అమలుపై మార్గనిర్దేశనం చేశారు. త్వరలోనే ఈ విధానం అందుబాటులోకి రానున్నట్లుగా మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలు భారీగానే ఉన్నాయి. గతంలో ఉన్న వీటికి తోడుగా ఇటీవల మరికొన్ని చేరాయి. రాజకీయ జోక్యం కారణంగా మున్సిపల్ అధికారులువాటి జోలికి వెళ్లడం లేదనే విమర్శలున్నాయి. అయితే తాజాగా ఆన్‌లైన్‌లో అందిన ఫిర్యాదులను అధికారులు 22 రోజుల్లోగా పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో అక్రమాలకు ఇక చెక్ పడే అవకాశముంది. ఈ పోర్టల్‌ను నేరుగా రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ కార్యాలయం మానిటరింగ్ చేయనుంది.

అవగాహన కల్పిస్తున్నాం



టీఎస్ బీపాస్‌లో కొత్త ఇళ్ల నిర్మాణాల కోసం ఏ విధంగా దరఖాస్తు చేస్తున్నారో అలాగే అక్రమ నిర్మాణాలపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక ఆప్షన్‌ను తీసుకొచ్చింది. దీన్ని ఎంచుకుని వివరాలు నమోదు చేయాలి. త్వరలో అందుబాటులోకి రానున్న ఈ విధానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. సంబంధిత శాఖల అధికారుల భాగస్వామ్యం ఉండటంతో వారితో కలిసి అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరిస్తాం. –**అనురాధ, టీపీఎస్, ఆదిలాబాద్**

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న అరవింద్ మీనన్

- బీజేపీ స్టేట్ కోఇన్‌చార్జి అరవింద్ మీనన్

ఆదిలాబాద్: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కోఇన్‌చార్జి అరవింద్ మీనన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో శనివారం నిర్వహించిన బీజేపీ జిల్లా పదాధికారుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. అలాగే సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ మాట్లాడు తూ రాబోయే ఆరు నెలలు అత్యంత కీలకమన్నారు. కార్యకర్తలు ప్రజల్లో ఉంటూ బీఆర్‌ఎస్ నాయకుల అవినీతిని ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో నా యకులు అయ్యన్న గారి భూమయ్య, రాథోడ్ రమే శ్, రమేష్, సుహాసిని రెడ్డి, ఆదినాథ్, వేణుగోపాల్, ధోని జ్యోతి, మయూర్ చంద్ర, విజయ్, లాలామున్నా, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరిపించాలి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కైలాస్‌నగర్: కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఇటీవల చోటు చేసుకున్న ఆత్మహత్యలపై విచారణ జరిపించి, శ్రీ చైతన్య, నారాయణ విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గేడం కేశవ్ డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విచారణ పూర్తయ్యే వరకు ఆ విద్యాసంస్థల్లో అడ్మిషన్లు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గణేశ్, ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నాయకులు సందీప్, బాదల్, తరుణ్, వరుణ్ పాల్గొన్నారు.

సంజయ్ దిష్టిబొమ్మ దహనం



సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై కేసు నమోదు చేయాలని ఆదిలాబాద్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రంగినేని మనీషా డిమాండ్ చేశారు. బండి సంజయ్ వైఖరిని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం ఆయనపై వన్ టౌన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఓ మహిళా ఎమ్మెల్సీ అని కూడా చూడకుండా మహిళా లోకాన్ని అవమాన పరిచేలా మాట్లాడిన బండి సంజయ్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పవన్‌రావు, అహ్మద్, గంగారెడ్డి పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే రాజయ్యను బీఆర్‌ఎస్ నుంచి బహిష్కరించాలి'



మాట్లాడుతున్న గండ్రత్ సుజాత

ఆదిలాబాద్‌టౌన్: స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్యను వెంటనే బీఆర్‌ఎస్ పార్టీ నుంచి బహిష్కరించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే తనను లైంగికంగా వేధిస్తున్నారని మహిళా సర్పంచ్ నవ్య మీడియా ద్వారా ఆవేదన వ్యక్తం చేసినా సీఎం కేసీఆర్ స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. పట్టణంలోని ఆమె నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. అధికార పార్టీలో ఉన్న మహిళలకే రక్షణ కల్పించలేని ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న మహిళలకు ఏం రక్షణ కల్పిస్తుందని ప్రశ్నించారు. సర్పంచ్ నవ్యకు కాంగ్రెస్ పార్టీ నుంచి పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ లక్ష్మిబాయి, వెంకట్‌రెడ్డి, గంగమ్మ, కవిత, నస్రీన, రాజేశ్వర్, కిష్టు, సంతోష్, విట్టల్, నర్సింలు, గంగన్న, రూపేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పట్టాలిచ్చే వరకూ కదిలేది లేదు



దీక్షలో పాల్గొన్న ఆదివాసీ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని బట్టిసావర్‌గాం శివారు సర్వే నంబర్ 72లో ఆదివాసీ గిరిజనులకు ఇంటిపట్టాలు ఇచ్చేంత వరకు ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తే లేదని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 రోజులుగా నిరసన చేపడుతున్నా స్పందించడంలేదన్నారు. దీంతో శనివారం నిరాహారదీక్షకు పూనుకున్నట్లు చెప్పారు. కూలి పనులు చేసుకుంటూ అద్దెఇళ్లలో నివాసం ఉంటూ జీవనోపాధి సాగిస్తున్న తాము ఇంటిఅద్దె చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. తమకు పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇచ్చేంత వరకు తాము ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయికే సంజీవ్, ఆదివాసీ నాయకులు ఉయికే ఇంద్ర, సోయం లలిత, నాగుబాయి, వెట్టి మనోజ్, వైస్ ఎంపీపీ జంగు, ఆత్రం గణపతి, కుడ్మెత ప్రకాశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళపై పిచ్చికుక్క దాడి

ఆదిలాబాద్‌టౌన్‌: పట్టణంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్లపై గుంపులు గుంపులుగా తిరుగుతూ జనాలపై ఎగబడుతున్నాయి. తాజాగా కోజా కాలనీకి చెందిన సురేఖ ఇంటిముందు ముగ్గు వేస్తుండగా పిచ్చికుక్క దాడిచేసి గాయపర్చింది. వెంటనే కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. కోజా కాలనీలో ఇది వరకు ఆరు గురిపై పిచ్చి కుక్కలు దాడి గాయపర్చాయి. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో తోపుడు బండి దగ్ధం

ఆదిలాబాద్‌టౌన్‌: పట్టణంలోని శివాజీచౌక్‌లో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు తోపుడుబండి దగ్ధమైంది. తోపుడుబండ్లు నిలిపే గోదాంలో షార్ట్‌సర్క్యూట్‌ జరిగి తోపుడుబండితో పాటు డ్రై ఫ్రూట్స్‌ దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు.

‘108’లో ప్రసవం

ఇచ్చోడ(బోథ్‌): మండలంలోని గుండాల గ్రామానికి చెందిన గర్భిణి బేగంబీకి శనివారం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో వాహనాన్ని రోడ్డుపక్కన ఆపారు. పైలెట్‌ నరేందర్‌, ఈఎంటీ గోపి ప్రసవం చేయడంతో మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్‌: మహారాష్ట్రలోని చంద్రాపూర్‌ జిల్లా జివితి తాలుకా గోండాపూర్‌కు చెందిన అనిత (26)ఈ నెల 5న తన ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన చంద్రాపూర్‌ ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం శుక్రవారం రిమ్స్‌ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. టూ టౌన్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.









మళ్లీ ప్రాణం పోసేలా..

- సీపీఆర్‌తో ఆగిన గుండెకు ఊపిరి
- ఇటీవల పెరిగిన గుండెపోటు మరణాలు
- అప్రమత్తమై డాక్టర్లకు శిక్షణ ఇస్తున్న వైద్యశాఖ
- ఈ నెలలో సిబ్బందికి, ఆ తర్వాత ఇతర శాఖల్లోనూ తర్ఫీదు

నిర్మల్‌చైన్‌గేట్‌: దేశవ్యాప్తంగా సడెన్‌ కార్డియాక్‌ అరెస్ట్‌ కేసులు పెరుగుతున్నాయి. నిత్యం పలువురు గుండెపోటుతో చనిపోతున్నారు. యుక్త వయస్సులో ఉన్నవారు, చిన్నారులు కూడా మృత్యువాత పడుతున్నారు. హార్ట్‌ ఎటాక్‌ వచ్చిన వారికి వెంటనే సీపీఆర్‌ చేస్తే బతికే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై గుండెపోటు సంఘటనలపై జాగ్రత్తగా ఉండాలని, సీపీఆర్‌ చేసే విధానంపై దృష్టి సారించాలని వైద్యశాఖకు ఆదేశాలు జారీ చేసింది. గుండెపోటు వచ్చిన వ్యక్తులకు వైద్యం అందేలోపు సీపీఆర్‌ ప్రక్రియ నిర్వహిస్తే ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఏఎస్పీ (ఫైల్‌)



- గత నెల 26న నిర్మల్‌ జిల్లా కుభీర్‌ మండలంలోని పార్డి(కె)లో పెళ్లి బరాత్‌లో పెళ్లి కుమారుని బంధువైన మహారాష్ట్రలోని శివుని గ్రామానికి చెందిన ముత్యం(18) అనే యువకుడు డ్యాన్స్‌ చేస్తూ ఒక్కసారిగా కుప్ప కూలాడు. గమనించిన స్థానికులు యువకుడిని లేపి పరిశీలించగా అపస్మారక స్థితికి చేరుకున్నాడు. హుటాహుటిన భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.
- గత నెల 27న నిర్మల్‌ జిల్లా ముధోల్‌ మండలంలోని చించాలలో ఒకేరోజు ఇద్దరు వ్యవసాయ కూలీలు గుండెపోటుతో మృతి చెందారు. వరగంటి లక్ష్మణ్‌ (33) ఆదివారం రాత్రి 11 గంటలకు గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలిసిన గ్రామస్తులతో పాటు కండెల రాఘవులు (42) మృతున్ని చూసేందుకు వెళ్లారు. ఇంటికి తిరిగివచ్చిన రాఘవులు 12 గంటల ప్రాంతంలో గుండెపోటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే భైంసాలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.
- ఈ నెల 9న నిర్మల్‌ జిల్లా ఖానాపూర్‌ మండలం మస్కాపూర్‌ గ్రామానికి చెందిన ప్రధానోపాధ్యాయుడు చిలుకూరి విజయేందర్‌ (51) గుండెపోటుతో మృతి చెందాడు. పెంబి మండలం మందపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజయేందర్‌ విధులకు వెళ్లేందుకు ఉదయం ఇంట్లో సిద్ధమవుతుండగా ఒక్కసారిగా కుప్పకూలాడు. కుటుంబసభ్యులు నిర్మల్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.
- ఈ నెల 11న మంచిర్యాల జిల్లా జన్నారం మండలం రూప్‌నాయక్‌తండాకు చెందిన బూక్యా దశరథ్‌నాయక్‌ (51) గుండెపోటుతో మృతి చెందాడు. కవ్వాల్‌ బాలికల ఆశ్రమ పాఠశాల వార్డెన్‌గా పనిచేస్తున్న దశరథ్‌నాయక్‌ జన్నారం పాఠశాల ఇన్‌చార్జి వార్డెన్‌గా కూడా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి విపరీతమైన దగ్గుతో పాటు చాతిలో నొప్పిరావడంతో కుటుంబ సభ్యులు జన్నారం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో లక్సెట్టిపేటకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు.

సీపీఆర్‌ ఎలా చేయాలంటే?

సీపీఆర్‌.. (కార్డియో పల్మనరీ రీససిటేషన్‌) గుండె పనితీరు అకస్మాత్తుగా ఆగిపోయేటప్పుడు, ఆగిపోయిన వారికి వెంటనే పంప్‌ చేసేందుకు ఈ ప్రక్రియ చేపడతారు. సీపీఆర్‌ చేసేటప్పుడు బాధితుడిని బల్లపరుపుగా ఉన్న స్థలంలో పడుకోబెట్టాలి. ఎడమచేతి వేళ్ల మధ్య కుడిచేతి వేళ్లు లేదా కుడిచేతి వేళ్ల మధ్య ఎడమచేతి వేళ్లు జొప్పించి బాధితుడి ఛాతి (గుండెపై కాదు)మధ్య భాగంలో నొక్కాలి. క్రమంగా ప్రెస్‌ చేస్తూ ఉండాలి. నొక్కేటప్పుడు మన చేతులు, మోచేతులు అసలు బెండు కాకూడదు. చేతులు స్టిఫ్‌గా ఉంచి నొక్కాలి. బాధితుడి చాతి కనీసం ఐదు సెంటీమీటర్లు లోపలికి వెళ్లేలా నొక్కాలి. ఎముకలు విరిగిపోతాయని భయపడకూడదు. నిమిషానికి వందసార్లు ప్రెస్‌ చేశాక పల్స్‌ చెక్‌ చేయాలి. పల్స్‌ దొరకకపోతే మళ్లీ ఆ ప్రక్రియ కొనసాగించాలి. ఇలా ఒక్కోసారి 20 నుంచి 30 నిమిషాల వరకు చేస్తూనే ఉండాలి. కంటిన్యూస్‌గా చేస్తున్నప్పుడు గుండె మళ్లీ కొట్టుకునే అవకాశం ఉంటుంది. హార్ట్‌ ఎటాక్‌ వచ్చిన వెంటనే సీపీఆర్‌ చేస్తే ప్రయోజనం ఉంటుంది. ఆలస్యం చేస్తే లాభం ఉండదు. ఇవి చేస్తూనే అంబులెన్స్‌లకు సమాచారం ఇవ్వాలి.

శిక్షణ ఇస్తాం



ప్రజలతో సంబంధాలున్న శాఖల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగులకు సీపీఆర్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తాం. జీవీకే సంస్థ ఆధ్వర్యంలో వైద్యులకు సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. బేల, పిట్టబొంగరం, ఇచ్చోడ, సైద్‌పూర్‌, తలమడుగు పీహెచ్‌సీల వైద్యాధికారులు వంశీ, ప్రతాప్‌ నాయక్‌, సాగర్‌, యు.స్వామి, హరీశ్‌ కుమార్‌ శిక్షణ పొందారు. అన్నిశాఖల ఉద్యోగులతో పాటు ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరికీ శిక్షణ ఇస్తాం. మ్యాన్‌కిన్స్‌ బొమ్మలు రావాల్సి ఉంది. అవి వచ్చిన వెంటనే శిక్షణ ప్రారంభిస్తాం. **– రాథోడ్‌ నరేందర్‌, డీఎంహెచ్‌వో**

మాస్టర్‌ ట్రైనింగ్‌ పూర్తి

ఈ నెల 1న మంచిర్యాల జిల్లాలోని ఐదుగురు ప్రభుత్వ వైద్యులకు ఇటీవల హైదరాబాద్‌లో మాస్టర్‌ ట్రైనింగ్‌ అందించారు. పాతమంచిర్యాల యూపీహెచ్‌సీ డాక్టర్‌ రమేశ్‌, షంశేర్‌నగర్‌ యూపీహెచ్‌సీ డాక్టర్‌ సృజన్‌, దండేపల్లి పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్‌ సతీశ్‌, జైపూర్‌ పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్‌ అనిల్‌, వేమనపల్లి పీహెచ్‌సీ డాక్టర్‌ రాజేశ్‌ శిక్షణ పొందారు. నిర్మల్‌ జిల్లాలో వెల్మల్‌, పెంబి, కుంటాల, బాసర పీహెచ్‌సీలకు చెందిన వైద్యులకు మాస్టర్‌ ట్రైనర్లుగా శిక్షణ ఇచ్చారు. మున్సిపల్‌, పోలీస్‌, రెవెన్యూతో పాటు ఇతర శాఖల సిబ్బందికి పలు దఫాలుగా శిక్షణ అందించనున్నారు.

అకస్మాత్తుగా ఎందుకు ఆగిపోతుంది..

ఊపిరితిత్తుల్లో రక్తం గడ్డ కట్టడం, గుండె కొట్టుకోవడంలో సమస్యలు ఏర్పడటం, గుండె కండరం దళసరిగా ఉండడం, ఒత్తిడి వంటి ఏదో కారణంతో సడన్‌ కార్డియాక్‌ అరెస్ట్‌ ఏర్పడుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. సడన్‌ కార్డియాక్‌ అరెస్ట్‌కు గురైతే గుండె మొత్తం ఒకేసారి పనిచేయడం ఆగిపోయి నిమిషాల వ్యవధిలోనే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. జంక్‌ఫుడ్‌, స్థూలకాయం, ధూమపానం, అధికంగా మద్యం సేవించడం, మానసిక ఒత్తిడి, రక్తపోటు, మధుమేహం కారణంగా గుండె వ్యాధి లేని వారు కూడా సడన్‌ కార్డియాక్‌ అరెస్ట్‌ బారిన పడుతున్నారు. రోజూ వ్యాయామం చేస్తే కార్డియాక్‌ అరెస్ట్‌ బారిన పడకుండా కొంతవరకు కాపాడుకునే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు.

అవగాహన పెంచుకోవాలి



గుండెపోటు వచ్చిన సమయంలో సీపీఆర్‌ ప్రక్రియ చాలా ప్రధానమైనది. ఆలస్యం చేయకుండా వెంటనే చేతులతో కొన్ని నిమిషాల పాటు ప్రెస్సింగ్‌ చేస్తే తిరిగి గుండె పనిచేస్తుంది. ఈ ప్రక్రియ ద్వారా మనిషి ప్రాణాలను తిరిగి నిలబెట్టవచ్చు. సీపీఆర్‌పై అందరూ అవగాహన పెంచుకోవాలి. **– డాక్టర్‌ రత్నాకర్‌, ఎండీ జనరల్‌ ఫిజీషియన్‌, సర్వజన ఆస్పత్రి, నిర్మల్‌**

బతికే అవకాశం ఉంది



ఎవరైనా గుండెపోటుకు గురై హఠాత్తుగా పడిపోతే సీపీఆర్‌ చేయడంతో బతికే అవకాశాలు ఉన్నాయి. రెండు చేతులతో రోగి చాతిపై బలంగా నొక్కాలి. ఇలా 20 నుంచి 30 సార్లు చేయడం వల్ల రక్త ప్రసరణ జరిగి గుండె మళ్లీ కొట్టుకునే అవకాశం ఉంటుంది. వెంటనే రోగిని దవాఖానాకు తీసుకెళ్లాలి. **– డాక్టర్‌ అరుణ్‌ మోరే, గుండె వైద్యనిపుణుడు, డీవీఆర్‌ హాస్పిటల్‌, నిర్మల్‌**

‘గిరి’ మహిళలకు ‘స్టార్‌ లెజెండ్‌’

- అవార్డుకు ఎంపికైన కన్నిబాయి, సోంబాయి
- ఆదివాసీ బిడ్డలకు దక్కిన గౌరవం

కెరమెరి(ఆసిఫాబాద్‌): కుమురం భీం జిల్లా కెరమెరి మండలంలోని భీమన్‌గోంది గ్రామానికి చెందిన మడావి కన్నిబాయి సేవా కార్యక్రమాలతో పాటు, కొలాం ఆదివాసీల జీవిత చరిత్ర, వారు పడుతున్న కష్టాలను అధికారులు దృష్టికి తీసుకువెళ్లి చూపారు. సాహస కృత్యాల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిల్లో పలు పతకాలు సాధించారు. అడ్వెంచర్‌ క్లబ్‌కే బ్రాండ్‌ అంబాసిడర్‌గా నిలిచారు. విశ్వంబరి చారిటబల్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ తాళ్లూరి సువర్ణకుమారి శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో మడావి కన్నిబాయి, కుమురంభీం మనవరాలు కుమురం సోంబాయికి ×జాతీయ మహిళా స్టార్‌ లెజెండ్‌ి అవార్డును అందజేశారు. ఇరువురిని శాలువాలతో సత్కరించి ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంతోశ్‌ కుమార్‌, పల్లం నవీన్‌కుమార్‌, స్వరూపరాణి, మాధవి, నీరజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అవార్డును ప్రదానం చేస్తున్న సువర్ణకుమారి

నాగోబా ఆలయంలో డీఎస్పీ పూజలు

ఇంద్రవెల్లి(ఖానాపూర్‌): ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్‌ నాగోబా ఆలయంలో శనివారం ఉట్నూర్‌ డీఎస్పీ సీహెచ్‌ నాగేందర్‌ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు శాలువాతో సత్కరించారు. నాగోబా ఆలయ నిర్మాణం, నాగోబా ఆలయ చరిత్ర తెలుసుకున్నారు. నాగోబా ఆలయ పిఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌, సర్పంచ్‌ మెస్రం రేణుక, మెస్రం వంశీయులు మెస్రం నాగ్‌నాథ్‌, మెస్రం ఆనంద్‌రావ్‌, మెస్రం బాదిరావ్‌పటేల్‌, తదితరులు ఉన్నారు.



డీఎస్పీని సత్కరిస్తున్న మెస్రం వంశీయులు

ఇరువర్గాలపై కేసు నమోదు

ఆదిలాబాద్‌రూరల్‌: మద్యం మత్తులో పరస్పరం దాడులకు పాల్పడిన ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగ్‌నాథ్‌ తెలిపారు. హోలీ వేడుకల్లో భాగంగా చాందా (టి) గ్రామానికి చెందిన కొంతమంది వేర్వేరుగా గ్రామ శివారులోని ఓ వ్యవసాయక్షేత్రంలో విందు చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన మారుతి, సంతోష్‌, శ్రీకాంత్‌, రాకేష్‌, గిరి తమభర్త రమేశ్‌తో పాటు మరోవ్యక్తి సంజీవ్‌పై దాడి చేశారని రజిత ఫిర్యాదు చేశారు. సంజీవ్‌, రమేశ్‌, నగేశ్‌, శ్రీను తనపై దాడి చేశారని శ్రీకాంత్‌ ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.



కల్చరల్‌ ఫెస్ట్‌ నిర్వహణ అభినందనీయం

ఉట్నూర్‌(ఖానాపూర్‌): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించేందుకు కల్చరల్‌ ఫెస్ట్‌ నిర్వహించడం అభినందనీయమని జెడ్పీచైర్మన్‌ రాథోడ్‌ జనార్దన్‌ అన్నారు. శనివారం ఐటీడీఏ ఆధ్వర్యంలో కుమురంభీం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దడం కోసం గిరిజన సంక్షేమ శాఖ చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాల్లో విద్యార్థులకు అవగాహన కలిగించేలా కార్యక్రమం రూపొందించామన్నారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు గిరిజన క్రీడోత్సవాలు, సైన్స్‌ఫేర్‌ ప్రదర్శనలు, మార్చిలో కల్చరల్‌ ఫెస్ట్‌ లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన 51 మంది విద్యార్థులకు ప్రశంస పత్రాలతో పాటు జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు దిలీప్‌కుమార్‌, ఉట్నూర్‌, భీంపూర్‌ జెడ్పీటీసీలు చారులత, సుధాకర్‌, డీటీడీవోలు మణెమ్మ, నీలిమ, ఏసీఎమ్‌వో జగన్‌, ఏటీడీవోలు సౌజన్య, నిహారిక, క్రాంతికుమార్‌, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్‌ రాథోడ్‌ జనార్దన్‌

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

ఆదిలాబాద్‌టౌన్‌: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి శనివారం మృతి చెందారు. ఆదిలాబాద్‌ పట్టణంలోని సుందరయ్యనగర్‌ కాలనీకి చెందిన మునేశ్వర్‌ విలాస్‌ (55) తన కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా స్పిన్నింగ్‌మిల్లు సమీపంలో ఓ ప్రైవేట్‌ స్కూల్‌ బస్సు ఢీకొట్టడంతో గాయాలపాలయ్యారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.



మునేశ్వర్‌ విలాస్‌(ఫైల్‌)

సాక్షి క్లాసిఫైడ్స్‌

WANTED

- హరేకృష్ణ హోంకేర్‌, హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌ / నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం, జీ:18K, ఏజెంట్‌ కమీషన్‌ 3K. ఫోన్‌: 9640258899, 9640468899 [H-786847]

FACULTY TEACHERS

- Lady Maths Lecturers Needed in Hyderabad. Salary: Rs. 40,000/-, Qual : M.Sc Maths / B.Sc Maths. ఆసక్తిగలవారు 'Math' అని 85230 58441 కు WhatsApp చేయగలరు. దయచేసి కాల్‌ చేయవద్దు. [B-985]
- హైదరాబాద్‌ వృద్ధాశ్రమంలో పని॥కు రెసి॥ లేడీకేర్‌ టేకర్స్‌, రెసి॥ వంటవారు (వ: 35సం॥ ఆపైన) & ఆయాలు కావలెను. మంచి జీతం ఫ్రీ వసతి, భోజన సదుపాయం. సంప్ర: Ph: 9700006699, 7981467036. [H-793526]



- షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము, హైదరాబాద్‌లో పని చేయుటకు లేడీవార్డెన్స్‌, లేడీసూపర్‌వైజర్స్‌, నర్సులు, కాంపౌండర్స్‌, ఆయాలు, భార్యాభర్తలు, వాచ్‌మెన్‌ కావలెను. Ph : 9391036931 / 9246585901 [HA-10360]
- పనివారు కావలెను. హైదరాబాద్‌, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-792834]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,